# పాలకులు - ప్రజాస్వామ్యం

**పొద్దున** లేచింది మొదలు ప్రజాస్వామ్యం గురించి పారాయణచేసే పాలకులు, ప్రభుత్వాల అధినేతలు – నిజమైన అర్థంలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని పిసరంతైనా ఆచరణలో పెట్టటానికి శ్రద్ధ చూపకపోగా, తాము చేపట్టే విధానాల, చర్యల సమగ్రసారమే ప్రజాస్వామ్య మన్నట్లుగా ప్రజలను, మధ్య తరగతి మేధావులను వంచింప జూస్తున్నారు.

మధ్య యుగాలనాటి ఫ్యూడల్, భూస్వామ్య, రాచరిక బంధనాల విముక్తికోసం బాధిత పీడిత ప్రజానీకం సాగించిన సంఘర్షణల్లో ఆధునిక ప్రజాస్వామ్య భావన ఉద్భవించిందనే లోతైన అవగాహన్నుగానీ; 'ప్రజలచేత – ప్రజలకొరకు' సాగించే – ప్రజల యొక్క పాలన అనే కనీసపాటి ప్రజాస్వామ్య దృక్పథాన్ని కానీ – పాలకులు ఏమాత్రం లక్ష్యపెట్టకపోగా, దానిని ఉద్దేశ్యపూరితంగా విస్మరిస్తున్నారు. ప్రజా రాశులను వారు సామాజిక సమీకరణాల ఓటు బ్యాంకులుగా చూస్తూ, ప్రజాస్వామ్యమంటే, ఓట్లు – ఎన్నికలుగా దిగజార్చారు.

పాలకులు – తాము ప్రభుత్వాధికారంలోకి రావటంకోసం వివిధ ప్రజా సమూహాలకు రాయితీలు, తాయిలాలు, పథకాలు ప్రకటించీ, వారిని ప్రలోభాలకు గురిచేసీ; కుల – మత – ప్రాంతీయ భావోద్వేగాలను ప్రేరేపించీ; డబ్బు – మద్యం – అధికారం – గూండాలు – పోలీసుల వంటి మార్గాలనన్నీ ప్రయోగించీ – వందమందికిగానూ పోలైన 50 ఓట్లలో 26 ఓట్లు పొందినవారు ప్రభుత్వపాలనాధికారాన్ని కైవసం చేసుకోవటాన్నే ప్రజాస్వామ్యంగా అపహాస్యం చేస్తున్నారు.

ఏ పాలకపార్టీ ఎన్నికలలో గెలిచి అధికారంలోకి వచ్చినా భూస్వామ్య, సామ్రాజ్యవాద ప్రయోజనాలకు ఊడిగంచేసే విధానాలనే అమలుచేస్తున్నాయి. అశేష పీడిత, శ్రామిక ప్రజానీకాన్ని దుర్భర దారిద్ర్యానికి గురిచేస్తూ, పిడికెడుమందిగా వున్న ధనికస్వాములకు దండిగా ఆదాయాలు సమకూర్చే ఈ క్రమంలో, అధికార రథచక్రాల నడుమన నలిగి ఛిద్రమైపోతున్న అభాగ్య ప్రజానీకపు గోడును గద్దెపై కూర్చున్నవారెవరూ ఆలకించటంలేదు. పైగా తమ వేదనలను, సమస్యలను నివేదించుకునే ప్రజల ప్రయత్నాలను గూడా పోలీసులను ప్రయోగించి పాలకులు కర్కశంగా అణచివేస్తున్నారు. అంతేతప్ప బాధిత ప్రజల సమస్యలను సావధానంగా విని, వారిని ఒప్పించి, సమస్యలను పరిష్కరించి, వారి మనసులను గెలవగలగటం దోపిడీ పాలకులను అసాధ్యమని స్పష్టమౌతోంది. ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులపై మరింతగా ఆధారపడుతూ దూకుడుగా ముందుకు సాగుతుండటాన్ని గమనించగలం.

పశ్చిమగోదావరిజిల్లా – భీమవరం మండలం, తుందుర్రులో పచ్చని పంటపొలాల్ని సేకరించి గోదావరి ఆక్వాఫుడ్ పరిశ్రమ నిర్మాణాన్ని చేపట్టారు. దీని ఫలితంగా పచ్చని ఆ ప్రాంతమంతా తీవ్ర కాలుష్యం బారిన పడుతుంది. పరిసరాల్లోని 40 గ్రామాలకు నీరందించే గొంతేరు డ్రెయిన్ కలుషితమౌతుంది. కనుక ఈ పరిశ్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని, ఈ పరిశ్రమను ఇక్కడ నుండి తరలించాలని డిమాండ్ చేస్తూ గత కొంతకాలంగా సంబంధిత గ్రామాల ప్రజానీకం ఆందోళన సాగిస్తున్నారు. ప్రజా ఆందోళనను ప్రభుత్వం అణచివేత ద్వారా గొంతు నొక్కివేయటానికే పూనుకొని వ్యవహరిస్తోంది. ఈ ప్రాంతంలో పోలీసులు 40 రోజులకు పైగా 144వ సెక్షన్ను అమలుచేస్తున్నారు. ఆధార్కార్డు లేకుండా గ్రామంలోకి ఎవరినీ అనుమతించటంలేదు. ఆ గ్రామాలలోని 300 మందిపై ఇప్పటికే పలు అక్రమకేసులు బనాయించారు.

కడపజిల్లా – మైదుకూరు మండలం, గొల్లపల్లిలో ఏసిసి యాజమాన్యంలో ఇంటిగ్రేటెడ్ సిమెంట్ కాంప్లెక్సు నిర్మాణం కోసం యాజమాన్యం పది సంవత్సరాలక్రితమే నామమాత్రపు ధర చెల్లించి 3,600 ఎకరాల భూములను రైతుల నుండి సేకరించింది. 5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో సిమెంట్ పరిశ్రమ నెలకొల్పుతామని ప్రకటించినా ఇంతవరకూ అందుకు పూనుకోకపోవటంతో భూములు కోల్పోయిన రైతులలో ఆందోళన పెరిగింది. దీనిని దృష్టిలో వుంచుకొని 20–10–16న ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. వెయ్యిమంది సాయుధ పోలీసులను ప్రభుత్వం ఈ సందర్భంగా మోహరించింది. చుట్టుప్రక్కల ప్రాంతాలను పోలీసులు దిగ్బంధం చేశారు. పోలీసు చెక్పోస్టులు పెట్టారు. రోడ్లపై ప్రజలను తిరగనియ్యలేదు. ఆర్టిసి బస్సులను సైతం దోవ మళ్ళించారు. పౌరహక్కుల, ప్రజాసంఘాల నాయకులను, ప్రత్యర్థి రాజకీయపార్టీల నేతలను ముందురోజే అదుపులోకి తీసుకున్నారు.

తూర్పుగోదావరిజిల్లా – తొండంగి మండలంలో దివీస్ యాజమాన్యం నిర్మించ తలపెట్టిన కాలుష్యకారక, ప్రమాదకర ఔషధ పరిశ్రమకు వ్యతిరేకంగా పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన సాగిస్తున్నారు. ఈ పరిశ్రమ నుండి వెలువడే వ్యర్థాలతో పరిసరాలన్నీ, తీవ్ర జల, వాయు కాలుష్యానికి గురవుతాయి. వాతావరణంలో ఉష్ణతాపం పెరుగుతుంది. రసాయన వ్యర్థాలను సముద్రంలో కలపటం వలన మత్స్యసంపదకు నష్టం వాటిల్లుతుంది. కనుక ఈ ప్రాంత ప్రజలు దివీస్ ఔషధ పరిశ్రమను వ్యతిరేకిస్తుంటే, వారి సమస్యలను ఆలకించి, వారిని సంతృప్తపరిచే చర్యలకు బదులుగా పోలీసు అణచివేతను ప్రయోగిస్తున్నారు. ఈ ప్రాంతంలో 144 సెక్షను విధించారు. 20–10–16న ఈ ప్రాంత పరిశీలనకు వచ్చిన వివిధ ప్రజా, మహిళాసంఘాల నేతలను అరెస్టు చేశారు.

అనంతపురంజిల్లా – యస్పికుంట మండల కేంద్రంలో 1500 మెగావాట్ల సామర్థ్యం కల్గిన సోలార్ ప్లాంట్ నిర్మాణం కోసం 8 వేల ఎకరాల భూములను రెండు సంవత్సరాల క్రితమే సేకరించారు. అయితే, ఈనాటికీ భూ యజమానులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించలేదు. భూములను కోల్పోయిన రైతులందరికీ పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసిన వామపక్ష

పార్టీల నాయకులు, కార్యకర్తలపై 20-10-16న పోలీసులు నిర్బంధం ప్రయోగించారు. అనేకమందిని అరెస్టు చేశారు. విచక్షణారహితంగా కొట్టారు.

కృష్ణాజిల్లా - మచిలీపట్నం తీరప్రాంత గ్రామాలలో పోర్టు, 'మడ' పేరున 30 వేల ఎకరాలపైగా భూముల 'సమీకరణకు' ప్రభుత్వం చర్యలను త్వరితం చేసింది. దీనిని వ్యతిరేకిస్తూన్న బాధిత గ్రామాల ప్రజల అసంతృప్తి, ఆందోళనలను సామ, దాన, బేధ, దండోపాయాలతో అణచివేస్తున్నారు.

శ్రీకాకుళంజిల్లా - కొవ్వాడలో పెనువిధ్వంసకరమైన అణువిద్యుత్‌కేంద్ర నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్న ప్రజలపై నిర్బంధాన్ని అమలుచేస్తూ ఆ ప్రాజెక్టు నిర్మాణ చర్యలను పాలకులు వేగవంతం చేస్తున్నారు.

విజయనగరం జిల్లా - భోగాపురం విమానాశ్రయ నిర్మాణానికి పచ్చని పంటపొలాల్ని ఇవ్వబోమని గట్టిగా ఎదురు నిలిచిన ప్రజలపై నిర్బంధచర్యలకు పాల్పడి, విమానాశ్రయ నిర్మాణ సన్నాహాలను నిలిపివేయబోమని ప్రకటించారు.

సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థినుల కనీసపాటి సమస్యలను పరిష్కరించమని విన్నవించటానికి వెళ్ళిన పిడిఎస్‌ఓ విద్యార్థి నాయకులను ప్రకాశంజిల్లా కలెక్టరు దగ్గరుండి అరెస్టు చేయించటం;

చట్ట ప్రకారం వ్యవహరించని బాపట్ల సిఐని నిలదీసి, అతనిపై కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేసినందుకు కక్షగట్టిన పోలీస్ యంత్రాంగం గుంటూరు జిల్లా పొన్నూరులో డా॥ రాజారావుపై అక్రమకేసులు మోపి, భారీఎత్తున పోలీసు బలగాలను మోహరించి, 144వ సెక్షన్ ప్రయోగించి, అరెస్టులు సాగించి భీతావహ వాతారణాన్ని కలిగించటం;

గిరిజనుల జీవనాధారాన్ని దెబ్బతీసే విజయనగరం జిల్లా బడిదేవరకొండ గ్రానైట్ తవ్వకాలకు ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలన్నందుకు రైతుకూలీ సంఘం జిల్లా నాయకులను అరెస్టులు సాగించటం - వంటి అనేకానేక సంఘటనలు పాలక ప్రభుత్వం నానాటికీ అణచివేతపై ఆధారపడి మాత్రమే పాలన సాగించగలిగిన పరిస్థితిలో వుందని తెలియపరుస్తున్నాయి. ప్రజలు - ప్రజాతంత్రవాదులు, పౌర, ప్రజాస్వామిక హక్కులసంఘాలు, ప్రజల కనీసపాటి ఆవేదనను వ్యక్తం చేయటానికి కూడా అవకాశాలను మృగ్యం చేస్తున్న ప్రభుత్వవిధానాలను ఎలుగెత్తి ఖండించాలి. ప్రజాస్వామిక హక్కుల చైతన్యాన్ని పెంపొందించే బలమైన ప్రజాస్వామిక హక్కుల ఉద్యమ నిర్మాణానికి పూనిక వహించాలి.

ooooo